RK అగ్ని న్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844

జూన్ : 25 మంగళవారం సంపుటి : 28 సంచిక : 152



2లో

గుంటి గంగమ్మ తిరుణాళ్ళ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల

# మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్ అంధకారం



## - సెబ్ డిఎస్పీ డి ఎస్ దుర్గా ప్రసాద్

అగ్ని న్యూస్,మార్కాపురం: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని భవిష్యత్తు ఉన్నత లక్ష్యం దిశగా నడిపించాలని సమాజానికి ఆదర్శవంతమైన వ్యక్తులుగానిలిచి చూపాలని తద్వారా ముందు తరాల వారు గర్వపడేలా జీవించడం సాధ్యమవుతుందని సెబ్ డిఎస్పీ డి ఎస్ దుర్గా ప్రసాద్ తెలిపారు. జూన్ 26 అంతర్జాతీయ మాదకద్రవ్యాలు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో మార్కాపురం ఆధ్వర్యంలో మార్కాపురం లోని కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీ, శ్రీ సాధన డిగ్రీ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు,చట్ట పరమైన చర్యలు, శిక్షలు, డ్రగ్స్ వ్యసనం నుంచి ఎలా బయటపడాలి, డ్రగ్స్ నిర్మూలనలో విద్యార్థులు పాత్ర తదితర అంశాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మార్కాపురం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి ఎస్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ కొందరు గమ్మత్తు ను ఆస్వాదించేందుకు, మరికొందరు మానసిక ఒత్తిడి, సమస్యల వలన, విద్యార్థులు, యువత కొత్త పరిచయాలు ద్వారా చెడు వ్యసనాలతో డ్రగ్స్ సేవించడం మొదలు పెడతారని, తుదకు వాటికి బానిసలై దొంగతనాలు, చైన్ స్నాచింగ్ ఇతర నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. డ్రగ్స్ వాడకం వలన ఆరోగ్యపరంగా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని తెలియజేశారు.

2లో

## డయేరియా... పారిశుధ్యం పై అవగాహన సదస్సు





అగ్ని న్యూస్,మార్కాపురం: మండలంలో డయేరియా కేసులు ప్రబలకుండా చూసి పారిశుధ్యంపై దృష్టి సారించాలని యం పి డి ఓ తోట చందన సూచించారు.సోమవారం స్థానిక యం పి డి ఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఓ హెచ్ ఎస్ ఆర్ ట్యాంకులను సకాలంలో శుభ్రపరచడం ట్యాంక్ వద్ద శుభ్రపరిచే తేదీని ప్రదర్శించాలని సూచించారు. అటువంటి క్లీనింగ్ నిర్వహిస్తున్నప్పుడు ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వాములను చేయాలని అదనంగా ఉత్తమమైన పారిశుధ్య పద్ధతులపై సమాచారాన్ని అందించాలని ఆమె కోరారు. దోమలు మలేరియా,డెంగ్యూ వ్యాధులు మొదలైన వాటిని నివారించడానికి ప్రతి శుక్రవారండ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని, తొట్టిలో నీటి నిలవ లేకుండా చూడాలని, మంచినీరు తొట్టి గుడ్డతో కట్టి ఉంచాలని ఇలాంటి పద్ధతులతో దోమలను నియంత్రించాలని యం పి డి ఓ కోరారు.ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఓ హెచ్ ఎస్ ఆర్ కోసం క్లోరినేషన్ చేయాలని టెయిల్ ఎండ్‌లో పారామీటర్ 0.2 పి పి యం ఉండేలా చూడాలని ఆమె కోరారు.

2లో

## శిలువ కూల్చివేత ఇప్పుడు జరిగింది కాదు

### - క్రైస్తవులు సంయమనం పాటించాలి

### - ఎస్సై వెంకట సైదులు





అగ్ని న్యూస్,పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి కొండపై ఉన్న ఏసు ప్రభు శిలువ ఆదివారం అర్థరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారనే వార్త సామాజిక మధ్యమాలలో చక్కర్లు కొట్టింది. వెంటనే పెద్దారవీడు ఎస్సై. వెంకట సైదులు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించారు.అయితే సంఘటన స్థలాన్ని పరిశీలిస్తే ఏసు ప్రభు శిలువ కూల్చివేత ఇప్పుడు జరిగిన ఆనవాళ్లు కనపడడం లేదని,అది యాదృచ్ఛికంగా జరిగిందా లేక కావాలనే చేశారా అనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలియజేశారు.ఆదివారం రోజునే తిరుమలనాథ స్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల నేపథ్యంలో రాజంపల్లి గ్రామన్ని సందర్శించిన ఎస్సై. వెంకట సైదులు

2లో

## గుంటి గంగమ్మ తిరుణాళ్ళ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల

మొదటి పేజీ తరువాయి

అగ్ని న్యూస్,కంభం:మండలంలోని ఎర్రబాలెం గ్రామంలో వెలసిన గుంటి గంగమ్మ తిరుణాళ్ళ మహోత్సవ కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేఅశోక్ రెడ్డికి స్థానిక టిడిపి నాయకులు, గ్రామ ప్రజలు సాదర స్వాగతం పలికి పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్ అంధకారం

మొదటి పేజీ తరువాయి

డ్రగ్స్ వాడకం వలన శరీరంలో నేరుగా మెదడు, కేంద్ర నాడీ వ్యవస్థపై ఎక్కువ ప్రభావంఉంటుందని, క్రమేపి ఇతర వ్యవస్థలపైనా దారుణమైన దుష్ప్రభావాలు ఏర్పడి రోగనిరోధక వ్యవస్థ, జీర్ణవ్యవస్థ పనితీరు దెబ్బతిని, శరీరం శుష్కించిపోతుందని, లివర్, ఊపిరితిత్తుల పనితీరు మందగించి, రక్తనాళాలు కుంచించుకుని గుండె అకస్మాత్తుగా ఆగిపోయే పరిస్థితి తలెత్తుతుందని, మెదడు, నరాలు దెబ్బతిని పక్షవాతం వస్తుందని, చివరకు బ్రతికున్న జీవచ్ఛవంలా మారిపోతారని తెలిపారు. గంజాయి, హెరాయిన్, కొకైన్ లాంటి డ్రగ్స్ రవాణా చేసినా, అమ్మినా, సేవించినా, వాటిని కలిగి ఉన్నా ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని, ఒకసారి డ్రగ్ కేసుల్లో పట్టుబడి పోలీసు రికార్డ్స్ లో పేరు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు పొందలేరని, పాస్ పోర్ట్, వీసాల వంటివి రావని, సమాజంలో గౌరవం కోల్పోతారని అన్నారు. డ్రగ్స్ వలన వాటిని అమ్మిన వ్యాపారులకు మాత్రమే లాభమని, సేవించిన వారికి తీవ్ర నష్టమని, కావున విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలు మీ దరి చేరకుండా స్మార్ట్ గా వ్యవహరించాలని, ఎట్టిపరిస్థితుల్లో డ్రగ్స్ వాడటం అలవాటు చేయరాదని సూచించారు. యువత ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవాటు చేసుకొని బంగారు జీవితాన్ని నిర్మించుకోవాలనిసూచించారు. ఎవరైనా డ్రగ్ అడిక్షన్ నుండి బయట పడాలంటే వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం, డి-అడిక్షన్ సెంటర్లో కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయటం వంటివి చేస్తామని తెలిపారు. మాదక ద్రవ్యాలు రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ హెచ్చరించారు. ఎవరైనా గంజాయి మాదకద్రవ్యాలు ఉన్నట్లు సమాచారం పోలీసులకు అందిస్తే వారికి తగిన నగదు బహుమతి ఇవ్వబడుతుందని,సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని డిఎస్పీ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఈ బి ఇన్స్పెక్టర్ కే శ్రీనివాసరావు, ఎస్సై యం వి గోపాలకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

## డయేరియా... పారిశుధ్యం పై అవగాహన సదస్సు

మొదటి పేజీ తరువాయి

క్లీనింగ్, ఫిల్లింగ్ తర్వాత ఓ హెచ్ ఎస్ ఆర్ కోసం మూతలు వేసేలా చూసుకోవాలని ఆమె కోరారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సృజన క్లోరినేషన్ విధానాన్ని వివరించారు పంచాయతీ కార్యదర్శులు చురుగ్గా పాల్గొని మండలంలో ఎలాంటి డయేరియా కేసులు తలెత్తకుండా చూడాలని ఈఓపీఆర్డీ రామ్మోహన్ రెడ్డి సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## శిలువ కూల్చివేత ఇప్పుడు జరిగింది కాదు

మొదటి పేజీ తరువాయి

ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని వారికి తగు సూచనలు చేశారు.దుండగులు శిలువ కూల్చివేత వార్తపై క్రైస్తవులు సంయమనం పాటించాలని ఎస్సై వెంకట సైదులు వారికి సూచించారు.



## 10 తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి

అగ్ని న్యూస్,మార్కాపురం:పూల సుబ్బయ్య కాలనీ లోని మునిసిపల్ హై స్కూల్ లో గత సంవత్సరం పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ మార్కులు 529 సాధించిన డి.ఖలీనా, రెండవ స్థానంలో 503 మార్కులు సాధించిన రూపశ్రీ లావణ్య, మూడవ స్థానంలో 495 మార్కులు సాధించిన షేక్.సాదియా లకు కీ.శే. పూల సుబ్బయ్య కుమార్తె పూల సునందిని, వారి భర్త ఇమ్మడి శ్రీనివాస్ లు హాజరై నగదు బహుమతులు అందజేశారు. ప్రతి సంవత్సరం పదవ తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ఇలాగే నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.ఎస్.ఎ.ఎల్.రవికుమార్ ధన్యవాదాలు తెలియజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దరిమడుగు ఎం.పి.పి.స్కూల్ ఎల్.ఎఫ్.ఎల్. హెచ్.ఎం. కె.ఎర్రయ్య, కె.వెంకటేశ్వర రావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## ముంపు గ్రామాల ప్రజలకు ఆర్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలి వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తిచేయాలి ఏపీ రైతు సంఘం డిమాండ్

అగ్ని న్యూస్,మార్కాపురం:కరువు కాటకాలకు నిలయమైన పశ్చిమ ప్రకాశం ప్రజానీకానికి వరప్రసాదమైన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేసి కృష్ణా జలాలను ఈ ప్రాంతానికి అందించాలని, ముంపు గ్రామాల ప్రజలకు ఆర్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. హనుమారెడ్డి, కె. వీరారెడ్డి లు మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా పశ్చిమ ప్రకాశం పాలకుల నిర్లక్ష్యానికి గురైందని, దీంతో ఈ ప్రాంతం పూర్తిగా వెనుకబడి పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాధారం తప్ప మరో నీటి ప్రత్యామ్నాయం లేని పశ్చిమ ప్రకాశానికి వెలిగొండ ప్రాజెక్టు శరణ్యమని అన్నారు.కొల్లం వాగు సమీపంలో హెడ్ రెగ్యులేటరీ నిర్మాణ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయని వాటిని తక్షణమే పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే సొరంగ మార్గంలో పై నుండి పెచ్చులు రాలుతున్నాయని, ఇలాగే కొనసాగితే సొరంగ మార్గం రాళ్లు రప్పలతో నిండిపోయే ప్రమాదం ఉంటుందని, కావున ఇప్పటికైనా సొరంగ మార్గం పైన కాంక్రీట్ తో నిర్మాణ పనులు పకడ్బందీగా చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. సొరంగ మార్గంలో మట్టి నిల్వలు పెరిగిపోయాయని వీటిని తక్షణమే తొలగించాలని వారి డిమాండ్ చేశారు.గత వైసిపి ప్రభుత్వ హయాములో ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల బాధితులకు ఆర్ఆర్ ప్యాకేజీ క్రింద నిధులు మంజూరు చేయకపోగా మరోవైపు ప్రాజెక్టు పూర్తి అయిందని జాతికి అంకితం చేస్తున్నానని చెప్పడం జగన్మోహన్ రెడ్డి దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని విమర్శించారు.ఇప్పటికైనా ముంపు గ్రామాల బాధితుల ఆవేదనను అర్థం చేసుకొని నూతన ప్రభుత్వం వారికి ఆర్ఆర్ ప్యాకేజీ కింద నిధులను మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను చేపట్టి 28 సంవత్సరాలు దాటుతున్నప్పటికీ నేటికీ పనులు పూర్తి కాకపోవడం ఈ ప్రాంత ప్రజలను తీవ్ర అన్యాయాన్ని గురిచేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి అయితే ప్రకాశం, నెల్లూరు, కడప ఉమ్మడి జిల్లాలలోని 32 మండలాలకు సాగునీరు, త్రాగునీరు లభిస్తుందని అన్నారు.అందులో భాగంగా 4,32,000 ఎకరాలకు సాగునీరు, 16 లక్షల 50 వేల మంది ప్రజలకు డ్రింకింగ్ వాటర్ అందనుందని అన్నారు. ఈ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి అవుతుందా ? అని ఈ ప్రాంత ప్రజలు కళ్ళల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి. హనుమారెడ్డి కె. వీరారెడ్డి లు అన్నారు.అనంతరం పై సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా కు రైతు సంఘం నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ సిపిఐ కార్యదర్శి అందే నాసరయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవేంద్ల శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్కె ఖాసిం, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పివి. కొండయ్య, ఎస్ వెంకటేశ్వర్లు, తర్లుపాడు మండల సిపిఐ కార్యదర్శి పి. వెంకటేశ్వర్లు, వైపాలెం నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు మన్నే సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి బాణాల రామయ్యలు పాల్గొన్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో : అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి కేవలం 499/- మాత్రమే only soft copy

## మెగా డీఎస్సీ ఫైల్ పైన తొలి సంతకం చేసిన నారా లోకేష్



అగ్ని న్యూస్,అమరావతి : మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన దస్త్రం పైనే సంబంధిత శాఖ మంత్రిగా నారా లోకేష్ తొలి సంతకం చేశారు.విధి విధానాలు రూపొందించి క్యాబినెట్ ముందుకు పెడుతూ సంతకం చేశారు.ఎన్నికల ప్రచారం లో ఇచ్చిన హామీ మేరకు మెగా డిఎస్సీ నిర్వహించి, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

## పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



అగ్ని న్యూస్,బేస్తవారిపేట: మండలంలోని పందిళ్ళపల్లె గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆవుల శ్రీనివాస రెడ్డిసోదరుడు ఆవుల రమణా రెడ్డి లక్ష్మి ప్రసన్న ల కుమారుడు ముకుందేశ్వర రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, స్థానిక నాయకులు పాల్గోన్నారు.

పంతులు
మెస్
ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర,
మార్కాపురం

## మట్టి పరీక్ష, నమూనా సేకరణ పై అవగాహన



అగ్ని న్యూస్, పెద్దారవీడు: సోమవారం మండల వ్యవసాయ అధికారిని మద్దలకట్ట రైతు భరోసా కేంద్రాన్ని యం ఈ ఓ బుజ్జి బాయి సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ఆఫీస్ లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామ రైతులతో మాట్లాడుతూ మట్టి పరీక్షలు చేయించుకోవడం వల్ల ఉపయోగాలు, ఏ పంటకు ఏ మోతాదులో ఎరువులు వేయాలో తెలుసుకోవచ్చని వివరించారు.ఈ సంవత్సరానికి గాను పెద్దారవీడు మండలానికి మొత్తం 548 మట్టి పరీక్షలు చేయించవలసిందని తెలియజేశారు. మొత్తం మండలంలో 12 రైతు భరోసా కేంద్రాలు ఉండగా అన్ని రైతు భరోసా కేంద్రాలకు సమానంగా కేటాయించడం జరిగిందని ఒక్కొక్క రైతు భరోసా కేంద్రానికి 48 మట్టి పరీక్షలు కేటాయించామని రైతులకు తెలియజేశారు. మద్దల కట్ట గ్రామంలో ఎర్ర వెంకట చెన్నయ్య అనే రైతు యొక్క పొలంలో మట్టి పరీక్ష కు మట్టిని ఎలా తీయాలి ఏవిధంగా ఎంత పరిమాణంలో తీయాలి అని రైతులకు డెమో ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం చాట్లమడ గ్రామంలో గల పత్తి పొలాలను సందర్శించి రైతులకు విలువైన సూచనలు సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, లాల రవి రైతులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమల అమలు తప్పనిసరి వై పాలెం, పుల్లల చెరువు యం ఈ ఓ లు



అగ్ని న్యూస్,యర్రగొండపాలెం: స్థానిక ఎంపిడిఓ కార్యాలయం గ్రామాలయం, సార్డ్ సంస్థ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం , పుల్లలచెరువు మండలాలకు చెందిన 50 పాఠశాలల నోడల్ అధికారులకు (ఉపాధ్యాయులకు) డెట్టాల్ బనేగా స్వస్థ ఇండియా-పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమల అమలు పై జరిగిన శిక్షణా తరగతులకు యం ఈ ఓ ఆంజనేయులు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పరిశుభ్రతా కార్యక్రమాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు జరుపుచున్నారని , మనం మన పాఠశాలల్లో స్వచ్ఛ భారత్ అమలు జరుపాల్సిన బాధ్యత మనదేనన్నారు. ప్రతీ పాఠశాలకు తప్పనిసరిగా పరిశుభ్రత నిర్వహణ కొరకు ఆయమ్మలు న్నారనీ వారికి తగు సూచనలు ఇస్తూ పాఠశాలలు , పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత పాఠశాల ఉపాధ్యాయులదేనన్నారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ సి హెచ్ సి సూపరిండెంట్ డా ఆదిత్య మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తి గత పరిశుభ్రత , ఆరోగ్యం పై దృష్టి సారించాలనీ , బాత్రూం , మరుగుదొడ్లుప్రతీరోజూ 2 సార్లు ఆయాలచే శుభ్రం చేయించాలనీ , అవి అపరిశుభ్రంగా వుంటేవిద్యార్థుల ఆరోగ్యం , చదువు పై పడే ప్రమాదముందన్నారు. ప్రతీ రోజూ భోజనానికి ముందు, టాయిలెట్ కి తర్వాత డేటాల్ లేదా సబ్బుతో చేతులు కాళ్ళు శుభ్రం చేసుకోవాలి, చేతులు శుభ్ర పరచే 6 రకాల విధానాలు తెలియసేశారు.డెట్టాల్ బనేగా స్వస్థ ఇండియా రాష్ట్ర సమన్వయకర్త కుమారి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పాఠశాలను తమ స్వంతంగా భావించి , విద్యార్థులను తమ స్వంత పిల్లలుగా భావించాలని , వారి ఆరోగ్యం పై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతుండాలనీ ,పాఠశాలలలో స్వచ్ఛతా కార్యక్రమం నిరంతరం అమలయ్యేలా చూడాలన్నారు.డి బి ఎస్ ఐ జిల్లా సమన్వయకర్త శ్రీమతి లక్ష్మి కార్యక్రమం గూర్చి వివరిస్తూ చేతులు పరిశుభ్రత గురించి కృత్యాలు చేసి చూపించి ఉపాధ్యాయులచే చేయించారు. టీచర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.వై పాలెం యం ఈ ఓ 2 మల్లు నాయక్ పుల్లలచెరువు మండల యం ఈ ఓ 1 శామ్యూల్ జాన్ , యం ఈ ఓ 2 శ్రీమతి ఇందిరా ప్రసాద్ కార్యక్రమం ఉద్దేశ్యం , అమలు జరుగుటకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ పి గా జి హెచ్ ఎస్ ఉపాధ్యాయులు సత్యనారాయణవ్యవహరించారు.కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు , సి ఆర్ యం టి లు పాల్గొన్నారు.అనంతరం రాష్ట్ర (జడ్ పి హెచ్ ఎస్ మురారి పల్లి), జిల్లా (జి హెచ్ ఎస్ వై పాలెం) స్వచ్ఛ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సన్మానం చేశారు.అందరికీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :
అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

## రాజంపేట పరిధిలో 5 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

### - ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు



అగ్ని న్యూస్, రాజంపేట: రాజంపేట పరిధిలోని తుమ్మలబైలు అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి 5ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ వీ. హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో, ఎస్పీ పీ. శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచనలతో ఆర్ ఎస్ఐ టీ.రాఘవేంద్ర టీమ్ ఆదివారం సాయంత్రం నుంచి అన్నమయ్య జిల్లా రాజంపేట పరిధిలోని తుమ్మలబైలు సెక్షన్ వద్ద కూంబింగ్ చేపట్టారు. సోమవారం ఉదయం బట్టేడు కోన , పుట్టంగి మడుగు మీదుగా బలసలమీది వైపు వెళ్లారు. ఆ ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వారిని టాస్క్ ఫోర్సు పోలీసులు చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు దుంగలను పడేసి పారిపోయారు. వారిని వెంబడించి ఇద్దరు స్మగ్లర్లను పట్టుకోగలిగారు. వారిని తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన పొన్నుస్వామి రాజి (36), ప్రభు వెల్లియన్ (30)లుగా గుర్తించి అరెస్టు చేశారు. వీరి నుంచి 5ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారి సమాచారం మేరకు మరి కొంత మంది అడవుల్లో ఉన్న తెలుసుకున్నారు. వారి కోసం టాస్క్ ఫోర్సు గాలింపులు చేపట్టింది. పట్టుబడిన వారినితిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించగా, ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. .

## తప్పుడు లీజు రద్దు చేయాలి - ఎమ్మెల్యే దామచర్ల




అగ్ని న్యూస్, ఒంగోలు: ఒంగోలు నగరంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ నందు ఆర్టీసీ సంస్థకు చెందిన విలువైన భూమిని గత వైసీపీ ప్రభుత్వం లో వైసీపీ నాయకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చట్టానికి విరుద్ధంగా, అధికారులను బెదిరించి తన సంస్థ పేరుతో లీజు తీసుకున్న స్థలాన్ని వెంటనే రద్దు చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం ఆయన స్థలం పరిశీలించి తక్షణమే పనులు నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు పంపిణీ

### - మంత్రి కొలుసు పార్థసారథి



అగ్ని న్యూస్, అమరావతి: సచివాలయ,గ్రామ వాలంటీర్లపై ఆంధ్రప్రదేశ్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది . పెన్షన్ల పంపిణీకి వాలంటీర్లను దూరం పెడుతున్నట్లు మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా పెన్షన్ల పంపిణీ చేయాలని నిర్ణయించామని ఆయన అన్నారు.ఒకటవ తేదీన సచివాలయ ఉద్యోగులతో పెన్షన్లు డోర్ డెలివరీకి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.అన్ని రకాల పెన్షన్లు సచివాలయం ఉద్యోగుల తోనే పంపిణీ చేయాలని నిర్ణయించామని ఆయన అన్నారు. వాలంటీర్ల పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు అని మంత్రి పార్థసారథి తెలిపారు.



## కొత్త పార్లమెంట్ భవనంలో సభ్యుల చే ప్రమాణ స్వీకారం చేయించిన ప్రొటెం స్పీకర్ తొలుత ప్రమాణం చేసిన ప్రధాని మోదీ







అగ్ని ప్రతినిధి, న్యూఢిల్లీ: 18వ లోక్ సభ తొలి సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎ ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్.. కార్యక్రమాలను ప్రారంభించారు. సభ్యులు రాజ్యాంగం మేరకు నడుచుకోవాలని సూచించారు. ఎన్నికైన సభ్యుల జాబితాను లోక్ సభ సెక్రటరీ సభ ముందుంచారు. అలాగే రాహుల్ గాంధీ వయనాడ్ కు రాజీనామా చేసినట్లు ప్రకటించారు. అనంతరం సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు భర్తృహరితో రాష్ట్రపతిభవన్లో ప్రొటెం స్పీకర్గా రాష్ట్రపతి ముర్ము ప్రమాణం చేయించారు. లోక్సభా పక్ష నేతగా ప్రధాని మోదీ తొలుత ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన పోడియం వద్దకు రాగానే ఎన్డీయే కూటమి సభ్యులంతా మోదీ, మోదీ అంటూ నినాదాలు చేశారు. అనంతరం నామినేటెడ్ ప్యానల్ స్పీకర్లు ప్రమాణం చేశారు. అయితే విపక్ష ఎంపిలు కొందరు ఇందుకు ముందుకు రాలేదు. అనంతరం కేంద్రమం త్రులు, ఇతర సభ్యులతో ప్రొటెం స్పీకర్ లోక్సభ సభ్యులుగా ప్రమా ణం చేయించారు. మంత్రుల్లో తొలుత రాజ్నాథ్ సింగ్ తరవాత అమిత్ షా, గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్లు వరుసగా ప్రమాణం చేశారు. తొలిరోజు 280 మంది ఎంపీలు ప్రమాణం చేయనున్నారు. మిగిలిన వారితో మంగళవారం ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం స్పీకర్ ఎన్నికకు నామినేషన్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. 26న స్పీకర్ ఎన్నిక పూర్తవుతుంది. 27న రాజ్యసభ కూడా ప్రారంభం కానుంది. అదే రోజు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించ నున్నారు. విపక్ష ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంటు సముదాయంలోని పాత భవనం వద్ద కలుసుకుని, అక్కడి నుంచి నూతన భవనం వరకు ర్యాలీగా వచ్చారు. మొన్నటివరకు మహాత్మాగాంధీ విగ్రహం ఉన్న ప్రాంతంలో రాజ్యాంగం చిరు ప్రతులను చేతపట్టుకుని కొంతసేపు నిరసన చేపట్టారు. అనంతరం వీరంతా ఒకేసారి లోక్సభకు వెళ్లారు. సభ ప్రారంభం కాగానే కేరళలోని వయనాడ్ స్థానానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన రాజీనామాను స్పీకర్ ఆమోదించారు. ఇటీవల జరిగిన లోక్సభ ఎన్నికల్లో పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ రాహుల్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అనంతరం వయనాడు వదులకుని రాయబరేలీ ఎంపీగా కొనసాగాలని ఆయన నిర్ణయించుకున్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :
అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కలిసిన తెలుగు సినీ నిర్మాతలు



అగ్ని న్యూస్, విజయవాడ: ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులను సినీ పరిశ్రమ తరఫున అభినందించడానికి అపాయింట్మెంట్ అడిగగా, తమ విజ్ఞాపనకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించినట్లు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తెలియచేశారు. ముఖ్యమంత్రి  చంద్రబాబు నాయుడుతో మాట్లాడతానని పవన్ కళ్యాణ్  హామీ ఇచ్చారన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఉన్న సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చించలేదనీ, త్వరలోనే మరోసారి కలిసి చిత్ర పరిశ్రమ సమస్యలు, రాష్ట్రంలో సినీ రంగ విస్తరణకు ఉన్న అవకాశాలపై చర్చిస్తామని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో తెలుగు సినీ నిర్మాతలు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్, నిర్మాతలు సి.అశ్వనీదత్, ఎ.ఎం.రత్నం, డి.సురేష్ బాబు, ఎస్.రాధాకృష్ణ (చినబాబు),రాజు,భోగవల్లి ప్రసాద్, డి.వి.వి.దానయ్య , సుప్రియ, ఎన్.వి.ప్రసాద్,బన్నీ వాసు,నవీన్ ఎర్నేని, నాగవంశీ, టి.జి.విశ్వప్రసాద్, వంశీ కృష్ణ, వై.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



# మీకోసం కు విశేష స్పందన

అగ్ని న్యూస్, ఒంగోలు: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యత, సమయపాలన అతి ముఖ్యమని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్) అయిన “మీకోసం” కార్యక్రమాన్ని సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల, డివిజన్ కార్యాలయాలతోపాటు జిల్లా స్థాయిలో కలెక్టరేట్లో నూ అధికారులు నిర్వహించారు. ప్రకాశం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డి.ఆర్.ఓ.  ఆర్.శ్రీలత, స్పెషల్ డిప్యూటీక లెక్టర్లు లోకేశ్వరరావు, మాధురి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 214 అర్జీలు వచ్చాయి అని అధికారులు తెలిపారు.వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అప్పటికప్పుడే కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల ఉన్నతాధికారులు తమ లాగిన్లోకి వచ్చిన అర్జీలను రెగ్యులర్ గా పరిశీలిస్తూ, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా పిటిషన్ల పరిష్కారంలో సహేతుకత ముఖ్యమని ఆయన పునరుద్ఘాటించారు. స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆర్థికపరమైన, న్యాయపరమైన అంశాలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల విధుల నిర్వహణలో ఉత్తమ పనితీరు చూపిన అధికారులకు కలెక్టర్ ప్రసంశాపత్రాలు అందించారు.



# కేరళ కాదు కేరళం..

## - రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం



అగ్ని న్యూస్, త్రివేంద్రం: కేరళ రాష్ట్ర పేరును కేరళంగా మార్చాలని కోరుతూ ఇవాళ ఆ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్ ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రతిపక్షాలతో పాటు అందరూ ఏకపక్షంగా ఆ తీర్మానాన్ని ఆమోదించారు. పేరు మార్పునకు చెందిన తీర్మానాన్ని ఆమోదం కోసం త్వరలో కేంద్రానికి పంపనున్నారు. గత ఏడాది ఆగస్టులో కూడా ఇదే తరహా తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తు చేసింది.

# చంద్రన్న బీమా రూ.10లక్షలకు పెంపు!




అగ్ని న్యూస్, అమరావతి: చంద్రన్న బీమా పరిహారాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు. త్వరలో పాత్రికేయులు, న్యాయవాదుల్ని కూడా ఈ బీమా కిందకు తీసుకొస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం పథకం పేరు మార్చడమే కాక ఎంతో మందికి పరిహారాన్ని ఆపిందని విమర్శించారు. కార్మికులు కార్మిక శాఖలో రూ.15 కట్టి ఈ పథకంలో చేరవచ్చు అని అన్నారు. ఈ పథకం కింద ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల పరిహారం అందుతుంది అని అన్నారు.



# అనుమతులు లేకుండా చర్చి నిర్మాణం

## అడ్డుకునేందుకు ప్రయత్నించిన విఆర్ఓ ,వీఆర్ఏ

## దౌర్జన్యంగా నిర్మాణ పనులు చేయిస్తున్న వైసిపి నాయకులు

## కూటమి పార్టీలకు వ్యతిరేకం చేసేందుకు పన్నాగం

అగ్ని న్యూస్, దోర్నాల: దోర్నాల మండలం ఐనముక్కల గ్రామంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఒక చర్చి వ్యవహారం వివాదాస్పదంగా మారుతుంది. గత కొన్ని రోజుల నుంచి ఐనముక్కుల గ్రామంలో అక్కడి వైసిపి మద్దతుదారులు ఎటువంటి అనుమతులు లేకుండానే పొలాల పక్కన చర్చి నిర్మాణ పనులు చేపట్టారు. వాస్తవానికి ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్ల నష్టం కలిగించేందుకు వైసీపీకి చెందిన కొందరు నాయకులు ఎస్సీ కాలనీ వాసులను ప్రలోభాలకు గురి చేసినట్లు తెలిసింది. కొత్తగా చర్చి నిర్మాణం చేసుకోండి అంటూ ఎస్సీలను రెండుగా విభజించేందుకు ప్లాన్ వేశారు. చర్చి నిర్మాణానికి అవసరమైన అంగీకార పత్రాలు ఇవ్వకుండానే కేవలం నోటి మాటలతో నిర్మాణ పనులు చేసుకోండి అంటూ వైసీపీ నాయకులు దళిత వర్గీయులను ఉసిగొలుపుతున్నారు. నియోజకవర్గంలో ఇటువంటి పన్నాగాల వల్ల టిడిపి ఓట్లు చీలి, వైసీపీకి పడ్డట్టు తెలుస్తోంది. అంతేకాకుండా భవిష్యత్తులో వచ్చే సర్పంచ్, జడ్పిటిసి ఎన్నికల్లో కూడా మాయమాటలతో ఓట్లు కొల్లగొట్టేందుకు వైసీపీ నాయకులు కుట్ర చేస్తున్నట్టు తెలిసింది.

ఏది ఏమైనప్పటికీ అనుమతులు, అంగీకార పత్రాలు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న చర్చి పనులను నిలిపివేయాలని సోమవారం దోర్నాల మండలం ఐనముక్కల గ్రామం వీఆర్ఏ మరియ దాస్, వీఆర్వో రవికుమార్ ఘటనా స్థలానికి వెళ్లి నిర్మాణ పనులు చేయిస్తున్న వారిని అడ్డుకున్నారు. అక్రమంగా చర్చి నిర్మాణం పనులు చేయవద్దని అక్కడ బోర్డులు పెట్టేందుకు వెళ్లిన రెవిన్యూ సిబ్బందిపై దౌర్జన్యానికి దిగారు. రెవిన్యూ సిబ్బందిపై గొడవకు దిగడంతో వారు వెనుదిరికి వెళ్లారు. ఈ విషయాన్ని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులకు చేరవేసేందుకు కింది స్థాయికి సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. పోలీసు అధికారులు జోక్యం చేసుకొని శాంతిభద్రతలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చర్చి నిర్మాణానికి అవసరమైన ధ్రువపత్రాలు అన్నీ ఉంటేనే నిర్మాణ పనులు చేపట్టాలన్న డిమాండ్ వ్యక్తం అవుతుంది. అనుమతులు లేని పక్షంలో దౌర్జన్యంగా నిర్మాణ పనులు చేయిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.





RK అగ్ని న్యూస్ The Power Of Truth
25 మంగళవారం , జూన్ 2024

# వైభవోపేతంగా సింగరాయకొండ బ్రహ్మోత్సవాలు - పాల్గొన్న మంత్రి డోలా







అగ్ని న్యూస్, ఒంగోలు: దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన సింగరాయకొండ లోని శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ మాధవరావు, కార్య నిర్వహణ అధికారి కృష్ణవేణి, పురోహితులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి కల్యాణోత్సవంలో మంత్రి పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఈ కళ్యాణోత్సవంలో పాల్గొన్నట్లు చెప్పారు. ఎంతో చారిత్రక విశిష్టత కలిగిన ఈ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. బ్రహ్మోత్సవాలలో స్వామివారి కల్యాణాన్ని వీక్షించడంలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ దృష్ట్యా భవిష్యత్తులో ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కళ్యాణ వేదికను అభివృద్ధి చేయడంతో పాటు క్యూ లైన్లలో కూడా అవసరమైన మార్పులు చేయాలని అధికారులకు చెప్పామన్నారు. ఈ విషయంలో దాతలు కూడా ముందుకు వచ్చి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. లక్ష్మీ నరసింహస్వామి వారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.అనంతరం జరుగుమల్లి మండలం దావగూడూరులోని శ్రీచెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలలో కూడా ఆయన పాల్గొన్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి డి.రజనీకుమారి, అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలను స్వామివారికి మంత్రి సమర్పించి కళ్యాణంలో పాల్గొన్నారు. అనంతరం తిరునాళ్లు జరుగుతున్న కామేపల్లిలోని శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయాన్ని కూడా మంత్రి సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వెంట పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు. కామేపల్లి, టంగుటూరు తదితర ప్రదేశాల లోని దేవాలయాలను మంత్రి సందర్శించారు.




Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)